నిర్వాసితులపై పట్టింపేది..?

- ఎన్టీపీసీ పవర్ ప్లాంట్‌తో ఇబ్బంది పడుతున్న మాతంగికాలనీ ప్రజలు
- ప్లాంట్ విస్తరణతో దుమ్ము, వాయు కాలుష్యం పెరిగే అవకాశం
- ప్రభావిత ప్రాంతాలను పట్టించుకోని యాజమాన్యం, అధికారులు
- పునరావాసం కల్పించాలని డిమాండ్



ఎన్టీపీసీ తెలంగాణ పవర్ ప్లాంట్ పక్కనే ఉన్న మాతంగికాలనీ

ఫెర్టిలైజర్‌సిటీ: పరిశ్రమలు వస్తే ప్రభావిత ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని భావించి పంటపొలాలు, ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఎన్టీపీసీ భూనిర్వాసితులకు కాలుష్యమే మిగిలిందని బాధితులు వాపోతున్నారు. ప్రభావిత ప్రాంతాలను యాజమాన్యం, అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఎన్టీపీసీ పవర్ ప్లాంట్‌ను విస్తరించేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో.. పునరావాసం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

వాయు కాలుష్యంతో ఇబ్బంది..

రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ మాతంగికాలనీ తెలంగాణ ఎన్టీపీసీ పవర్ ప్లాంట్‌కు ఆనుకొని ఉండడంతో ప్లాంట్ నుంచి వెలువడే కాలుష్యంతో కాలనీవాసులు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఆరేళ్ల క్రితం తెలంగాణ విద్యుత్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. మాతంగికాలనీ ప్లాంటుకు ఆనుకొని ఉండడంతో పవర్ ప్లాంట్ నుంచి వెలువడే శబ్దాలు, బూడిద, దుమ్ము, ధూళితో కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికి తోడు ఎన్టీపీసీ స్టేజ్ పవర్ ప్లాంట్‌ను విస్తరించేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ప్లాంట్‌ను విస్తరిస్తే భవిష్యత్‌లో కాలుష్యం మరింత పెరిగే ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. పవర్ ప్లాంట్‌ను విస్తరించేందుకు 19న చేపట్టనున్న ఎన్టీపీసీ తెలంగాణ స్టేజ్ టు ప్రభావిత ప్రాంతాల ప్రజలతో ప్రజాభిప్రాయ సేకరణ వాయిదా పడినట్లు అధికారులు తెలిపారు.

పట్టించుకోని యాజమాన్యాలు..

ఎన్టీపీసీ ప్రభావిత ప్రాంతాలైన ఖాజీపల్లి, మాతంగికాలనీలలో మౌలిక వసతులు, విద్య, వైద్యం వంటి సదుపాయాలు కల్పించాల్సిన యాజమాన్యం ఇతర ప్రాంతాలకు నిధులు కేటాయిస్తూ ప్రభావిత ప్రాంతాలను మరుస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. కాలనీల్లో సీసీరోడ్లు, మంచినీటి సౌకర్యం, వైద్య సదుపాయాలు లేకపోవడంతో కాలనీవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నూతన ప్లాంట్ విస్తరణతో కాలుష్యం మరింత పెరిగే ప్రమాదం ఉందన్నారు. అధికారులు స్పందించి మాతంగికాలనీ సురక్షిత ప్రాంతానికి తరలించి కాలనీవాసులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇప్పించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



ఎన్టీపీసీ పవర్ ప్లాంట్ నుంచి వెలువడే బూడిద, శబ్దాలు, వాయు కాలుష్యాలతో ఇబ్బందులు పడుతున్నాం. కాలనీలో యువకులు, వృద్ధులు, శ్వాస సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యంతో కాలనీలో ప్రతీ నాలుగు ఇళ్లలో ఒకరు అనారోగ్యానికి గురవుతున్నారు. అధికారులు స్పందించి కాలనీవాసులకు న్యాయం చేయాలి.

– చంద్రప్రకాశ్‌రెడ్డి, మాతంగికాలనీ

కాలనీని తరలించాలి



పవర్ ప్లాంట్ నుంచి వెలువడే బూడిద, వాయు కాలుష్యంతో శ్వాసకోశ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. బూడిదతో చర్మ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. పరిశ్రమలు, ఎన్టీపీసీ నుంచి వెలుపడే కాలుష్యంతో మాతంగికాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రోగాల బారిన పడే వారి సంఖ్య పెరుగుతోంది. అధికారులు స్పందించి కాలనీని తరలించాలి.

– డి.అరుణ, గృహిణి, మాతంగికాలనీ

పునరావాసం కల్పించాలి



పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం ప్రజలకు శాపంగా మారింది. ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించాల్సిన యాజమాన్యం స్పందించకపోవడంతో ప్రభావిత గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి నూతన పవర్ ప్లాంట్ విస్తరణకు ముందే మాతంగికాలనీని తరలించి ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ ఇప్పించాలి.

– జెట్టి జ్యోతిరమేశ్, 39వ డివిజన్ కార్పొరేటర్

క్లుప్తంగా

కనీస విద్యా ప్రమాణాలు కల్పించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతీ విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు కల్పించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. కలెక్టర్ పెద్దపల్లి విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల ఉపాధ్యాయులతో సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కాఫీ విత్ ఉపాధ్యాయుల కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులతో పఠనం, గణిత సామర్థ్యాలు పెంచాలన్నారు. డీఈవో మాధవి, జిల్లా సమగ్ర శిక్ష సమన్వయ కర్త పీఎం షేక్, అధికారులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



వైష్ణవిని అభినందిస్తున్న సీఐ సుబ్బారెడ్డి

సుల్తానాబాద్: సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేసిన ఖోఖో ఖేలో ఇండియా శిక్షణ శిబిరం సెంటర్ నుంచి జాతీయ ఖోఖో పోటీలకు జి.వైష్ణవి ఎంపికైనట్లు ఖోఖో అంతర్జాతీయ క్రీడాకారుడు, పెద్దపల్లి జిల్లా ఖేలో ఇండియా కోచ్ గెల్లు మధుకర్ యాదవ్ తెలిపారు. వైష్ణవిని శుక్రవారం సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి అభినందించారు. డిసెంబర్ 26 నుంచి 30 వరకు కేరళలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటుంది. డీవైఎస్‌వో సురేశ్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్ విద్యార్థిని అభినందించారు. పీఈటీ దాసరి రమేశ్, పీడీలు శంకరయ్య, శ్రీనివాస్, సీనియర్ క్రీడాకారులు గాజుల రాయమల్లు, పొరుపల్లి ఉమాపతి, కుమార్ కిషోర్, రవీందర్, ప్రసాద్, మహేందర్, యూనిస్ పాషా, పొరుపల్లి గుణపతి, ముస్తఫా, పీడీ ప్రణయ్, ఏలేటి సంపత్, కుమార్, అజ్జు ఉన్నారు.

పేదింటి యువతి వివాహానికి చేయూత



నగదు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోటకు చెందిన కే.శే శ్రీనివాస్‌గౌడ్ కూతురు వైష్ణవి వివాహానికి ట్రస్టు ఆర్థికసాయం అందించింది. ఆమె ఆర్థిక పరిస్థితి బాగాలేదని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న సుల్తానాబాద్ జీజేసీ బాల్యమిత్రుల ట్రస్టు ముందుకు వచ్చింది. శుక్రవారం ముప్పిరితోటలో వైష్ణవి వివాహానికి హాజరై ట్రస్టు సభ్యులు రూ.25వేలు, నూతన వస్త్రాలు అందించారు. బాల్యమిత్రుల ట్రస్టు గౌరవ అధ్యక్షుడు, కార్యదర్శులు లక్ష్మారెడ్డి, రామ్మూర్తి, బాలకిషన్ ప్రసాద్, రామస్వామి, బుర్ర జగదీశ్వర్‌గౌడ్, లక్ష్మన్, కరుణాకర్, గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం

జూలపల్లి: పార్లమెంట్‌లో సభా మర్యాదలు మరిచి బీజేపీ సీనియర్ ఎంపీ ప్రతాప్ సారంగిని గాయపర్చి, మహిళా ఎంపీపై దురుసుగా ప్రవర్తించిన కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ తీరును నిరసిస్తూ మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేశ్, నాయకులు సంకెన్ల నర్సయ్య, బొజ్జ సంపత్, మోహన్‌రెడ్డి, గంగారెడ్డి, వేణుగోపాల్, లక్కాకుల సంజీవ్, నాడెం రాజన్న, అశోక్, రాజు పాల్గొన్నారు.

సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన రాహుల్ 800 మీటర్ల రన్నింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ తుల శోభారాణి తెలిపారు. సుల్తానాబాద్‌లో జరిగిన పోటీల్లో విజేతగా నిలిచిన రాహుల్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర గణిత సెమినార్‌కు ఎంపిక

సుల్తానాబాద్: రామగుండం మండలం యూపీఎస్ దుర్గయ్యపల్లిలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న కె.అనిత రాష్ట్రస్థాయి గణిత సెమినార్‌కు ఎంపికైనట్లు జిల్లా విద్యాధికారి మాధవి తెలిపారు. రాష్ట్రస్థాయిలో జరిగే గణిత సెమినార్‌కు ఎంపికైన గణిత టీచర్ అనితను శుక్రవారం అభినందించారు.

ఉత్సాహంగా సీఎం కప్ జిల్లాస్థాయి పోటీలు



వాలీబాల్‌లో తలపడుతున్న బాలుర జట్లు



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డీవైఎస్‌వో సురేశ్

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సీఎం కప్ జిల్లాపోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. జిల్లా నలుమూలల నుంచి వాలీబాల్ క్రీడాకారులతోపాటు పలు అథ్లెటిక్స్ పోటీల్లో శుక్రవారం బాల, బాలికలు పాల్గొన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు డీవైఎస్‌వో సురేశ్ బహుమతులు అందజేశారు. సీఐ సుబ్బారెడ్డి, మినుపాల ప్రకాశ్‌రావు, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, కార్యదర్శి అమిరిశెట్టి తిరుపతి, క్లబ్ ప్రతినిధులు గాజుల రాజమల్లు, గుణపతి, కుమార్ కిషోర్, సత్యం, సుమన్, రాజు, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

నేడు అథ్లెటిక్స్ పోటీలు

సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం అథ్లెటిక్స్ పోటీలు, పలు ఫైనల్ మ్యాచ్ పోటీలు నిర్వహించనున్నారు. అనంతరం బహుమతులు ప్రదానం చేసే కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యే విజయరమణారావు, డీసీపీ చేతన హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ధాన్యం తూకంలో అవకతవకలపై విచారణ



విచారణ నిర్వహిస్తున్న అధికారులు

రామగిరి: మండలంలోని నాగెపల్లి ఐకేపీ సెంటర్‌లో శుక్రవారం జిల్లా అధికారులు విచారణ చేపట్టారు. వారంరోజుల క్రితం ఐకేపీ సెంటర్‌లో ధాన్యం తూకంలో మోసం జరిగిందని రైతులు ఆందోళన చేశారు. ఈ విషయంపై కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా తూనికల కొలతల అధికారి విశ్వేశ్వర్, పీడీ రవీందర్, డీసీవో శ్రీమాల, సివిల్ సప్లై డీఎం శ్రీకాంత్ సెంటర్‌ను సందర్శించారు. నిర్వాహకులు, రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. జిల్లా తూనికలు, కొలతల అధికారి మాట్లాడుతూ తూకంలో జరిగిన అవకతవకలపై విచారణలో భాగంగా యంత్రాన్ని తనిఖీ చేయగా 20కిలోలకు గాను 700గ్రాములు తక్కువగా చూపిందన్నారు. యంత్రాలను లీగల్ మెట్రాలజీ చట్టం ప్రకారం జప్తు చేసినట్లు తెలిపారు. సెంటర్ ప్రారంభానికి ముందు తూనికల అధికారులు వచ్చి యంత్రాన్ని పరిశీలించి ముద్ర వేశారని పేర్కొన్నారు. జరిగిన పొరపాటుపై సమీక్షిస్తామన్నారు. నిర్వాహకులు, రైతుల వాంగ్మూలాలు తీసుకున్నామని, పూర్తి నివేదికను కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. డీపీఎం తిరుపతి, ఏపీఎం స్వరూపరాణి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• డయల్ యువర్ డీఎంకు స్పందన

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.నాగభూషణం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు నిర్వహించిన డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమానికి స్పందన లభించింది. ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలు తెలియజేశారు. భూపాలపల్లి రూట్‌లో సర్వీసులు మరిన్ని పెంచాలని, మణుగూరు బస్సును యైటింక్లయిన్‌కాలనీ మీదుగా నడపాలని కోరారు. పెద్దపల్లి నుంచి జమ్మికుంటకు బస్సు నడపాలని, ఓదెల బస్సును మడక వరకు నడపాలని ప్రయాణికులు కోరినట్లు పేర్కొన్నారు.

• వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలి

ఓదెల: ప్రభుత్వ వైద్యశాలలో పనిచేసే వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా వైద్యాధికారి అన్నప్రసన్న ఆదేశించారు. ఓదెల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. రోగులతో వైద్యసిబ్బంది మర్యాదగా మాట్లాడాలని సూచించారు. డాక్టర్ షాబొద్దీన్ ఉన్నారు.

• కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

జ్యోతినగర్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ, కేరళ వామపక్ష ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేసే విధానాన్ని వెంటనే మానుకోవాలని సీఐటీయూ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు గీట్ల లక్ష్మారెడ్డి, శంకర్ డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు రోడ్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. అనంతరం పోస్టర్ విడుదల చేశారు. యూనియన్ నాయకులు రాఘవరెడ్డి, మల్లేశ్, యాకూబ్, షమీమ్ పాల్గొన్నారు.

• ఆటోడ్రైవర్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

గోదావరిఖని: అసెంబ్లీ ముట్టడికి బయలుదేరి వెళ్తున్న ఆటో డ్రైవర్లను గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి సాయంత్రం వదిలిపెట్టారు. ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆటోడ్రైవర్లను ఆదుకోవాలని కోరారు. రవికుమార్, రవి, వెంకట్ ఉన్నారు.

• చికిత్స పొందుతూ యువకుడు మృతి

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి రామగిరి మండలం సుందిళ్లకు చెందిన గిరుగుల శ్రీకాంత్(18)అనే యువకుడు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాంత్ గోదావరిఖనిలోని ఓ పండ్ల దుకాణంలో పని చేస్తున్నాడు. 18న తన బైక్‌పై గోదావరిఖనికి వెళ్లి పని ముగించుకొని రాత్రి సుందిళ్లకు బైక్ వస్తుండగా జనగామ గ్రామ శివారులోని విద్యుత్ స్తంభానికి ఢీకొనడంతో తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మృతుడి సోదరుడు తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

• విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

గోదావరిఖని: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం కోరారు. చలో అసెంబ్లీకి బయల్దేరిన ఏఐఎస్ఎఫ్ నాయకులను గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు.

• డ్రైవర్‌కు అస్వస్థత.. అదుపుతప్పిన బస్సు

మంచిర్యాలక్రైం: ఆర్టీసీ బస్సు నడుపుతున్న డ్రైవర్ ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యాడు. స్టీరింగ్‌పైనే పడిపోవడంతో బస్సు అదుపు తప్పి రెండు కార్లు, ద్విచక్ర వాహనాలను ఢీకొట్టింది. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని డిపోకు చెందిన బస్సు(టీఎస్ 02 జడ్ 0318) శుక్రవారం మధ్యాహ్నం మంచిర్యాల నుంచి కరీంనగర్‌కు వెళ్తోంది. పట్టణంలోని బెల్లంపల్లి చౌరస్తా, ఐబీ చౌరస్తా రోడ్డు మధ్యలోకి రాగానే డ్రైవర్ లొకిని ఎల్లయ్య బస్సు నడుపుతూనే ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురై స్టీరింగ్‌పై పడిపోయాడు. దీంతో బస్సు అదుపుతప్పి మోర్ మార్కెట్ ఎదురుగా ఉన్న రోడ్డులో పలు వాహనాలను ఢీకొట్టింది. మొదటగా స్కూటీని ఢీకొట్టి పక్కన నిలిపి ఉంచిన రెండు కార్లు, మరో రెండు ద్విచక్ర వాహనాలపైకి దూసుకెళ్లడంతో దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో స్కూటీ నడుపుతున్న చింతపండువాడకు చెందిన చింతపండు సత్యనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ ఎల్లయ్య త్వరగానే కోలుకుని బస్సును అదుపులోకి తెచ్చినట్లు ప్రయాణికులు తెలిపారు. అనంతరం డ్రైవర్‌ను కూడా ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాద విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను తొలగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మంచిర్యాల సీఐ తెలిపారు.

గుర్తింపు యూనియన్ ద్వారానే ఒప్పందాలు

గోదావరిఖని: సింగరేణి కార్మికుల కీలక సమస్యలపై గుర్తింపు యూనియన్ ద్వారానే ఒప్పందాలు జరుగుతాయని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి అన్నారు. జీడీకే–2వ గనిలో శుక్రవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బీఆర్ అంబేద్కర్‌ను అవమానపరిచిన కేంద్ర మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలన్నారు. 22న నిర్వహించే జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం కోసం యాజమాన్యంతో మాట్లాడి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. యాజమాన్యం స్పందించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ఆయన పేర్కొన్నారు. నాయకులు రంగు శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, వెంకన్న, రవి, రమేశ్, అజీంపాషా పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు కొలనూర్ విద్యార్థుల ఎంపిక



మెడల్స్‌తో శ్రావ్యశ్రీ, అశ్విత

ఓదెల: మండలంలోని కొలనూర్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రేండ్ల శ్రావ్యశ్రీ, కొలిపాక అశ్విత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సుల్తానాబాద్‌లో శుక్రవారం జరిగిన జిల్లాస్థాయి సీఎంకప్ షాట్‌పుట్ పోటీల్లో రేండ్ల శ్రావ్యశ్రీ ప్రథమస్థానం, డిస్కస్‌త్రోలో కొలిపాక అశ్విత రెండోస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ పూరెల్ల సదయ్య తెలిపారు. విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం నిట్టూరి ఏసుదాసు, పీడీ, ఉపాధ్యాయులు అభినందించారు.

సింగరేణి వార్తలు

మహిళా ఉద్యోగులకు రెస్ట్ హాల్ ఏర్పాటు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

గోదావరిఖని: ఆర్జీ–2 ఏరియా జీఎం కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు రెస్ట్ హాల్ ఏర్పాటు చేయాలని ఐఎన్‌టీయూసీ ఆర్జీ–2 ఉపాధ్యక్షుడు కొత్త సత్యనారాయణరెడ్డి కోరారు. ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్యను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. జీఎం ఆఫీస్ స్టాఫ్‌కు క్యాంటీన్ ఏర్పాటు చేయాలని, బైక్ షెడ్ నిర్మించాలని విన్నవించారు. క్లరికల్ సిబ్బందిని పెంచాలని, ప్రింటర్, ఫర్నిచర్ సౌకర్యం కల్పించాలన్నారు. వాటర్ ప్లాంట్ మెయింటినెన్స్ చేయాలని, అన్ని డిపార్ట్‌మెంట్లకు రికార్డు మెయింటినెన్స్ రూమ్ కావాలన్నారు. మహిళా కార్మికులు, ఐఎన్‌టీయూసీ నాయకులు ఉన్నారు.

అలరించిన ముగ్గులు, దీపాలంకరణ పోటీలు



గోదావరిఖని: జీఎం కాలనీ క్రీడా మైదానంలో దీపాలంకరణ పోటీల్లో పాల్గొన్న మహిళలు

గోదావరిఖని: సింగరేణి ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని ఆర్జీ–1, 2 ఏరియాల్లో ముగ్గులు, దీపాలంకరణ పోటీలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని పోటీ పడ్డారు.

రామగిరి: సెంటినరికాలనీ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం దీపాలంకరణ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆర్జీ–3, ఏపీఏ సేవా అధ్యక్షురాలు నరేంద్ర అలివేణి, కొప్పుల విజయలక్ష్మి ప్రారంభించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని రంగవల్లులు వేసి దీపాలతో అలంకరించారు. పరిశీలించి ఉత్తమంగా దీపాలతో అలంకరించిన రంగవల్లులను ఎంపిక చేశారు. 23న బహుమతులు ప్రదానం చేయనున్నారు. కోఆర్డినేటింగ్ ఆఫీసర్ గుర్రం శ్రీహరి, డీపీఎం వి.సునీల్ ప్రసాద్, హరిణి, సుజాత, సేవా కోఆర్డినేటర్ సుధాకర్ పాల్గొన్నారు.

ఉత్తమ గృహాల ఎంపిక



పరిశీలిస్తున్న ఎంపిక కమిటీ సభ్యులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలోని ఉత్తమ గృహాలను శుక్రవారం ఎంపిక చేశారు. ఉత్తమ పర్యావరణహిత గృహాల పోటీల్లో భాంగంగా సింగరేణి ఉద్యోగులు నివసించే గృహాలు, వారు పెంచుకునే మొక్కలు, ఇంటి పరిసరాల వాతావరణం, అలకరించుకున్న విధానాన్ని ఎంపిక కమిటీ సభ్యులు పరిశీలించారు. గృహ శోభ పోటీలకు 8మంది సింగరేణి ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా వారిలో ఎంపికైన ఉత్తమ గృహాలకు 23న నిర్వహించనున్న సింగరేణి వేడుకల్లో ఆర్జీ–2జీఎం వెంకటయ్య చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నట్లు ఎంపిక కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఎంపిక కమిటీ సభ్యులు ఏఐటీయూసీ ఆర్జీ–2 బ్రాంచ్ సెక్రటరీ రవీందర్, డీజీఎం పర్సనల్ అండ్ అధికార ప్రతినిధి అనిల్‌కుమార్, ఇఇ సివిల్ ప్రతాపగిరి రాజు, ఫారెస్ట్ అధికారి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

సింగరేణి వేడుకల ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి: మండలంలోని సెంటినరికాలనీ రాణిరుద్రమ దేవి క్రీడా ప్రాంగణంలో 23న నిర్వహించనున్న సింగరేణి వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకర్‌రావు పరిశీలించారు. క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసే వేదిక, స్టాల్స్, పార్కింగ్ లైటింగ్ ఏర్పాట్లకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. వేడుకల్లో సింగరేణి ఉద్యోగులు, కాలనీవాసులు, పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎస్‌వోటూ జీఎం జి.రఘుపతి, సివిల్ డీజీఎం రాజేంద్రకుమార్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ఏరియా సెక్యూరిటీ అధికారి షబ్బీరుద్దీన్, ఎస్ఈ సతీశ్‌చంద్ర, అధికారులు శ్రీహరి, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆర్మీ ఆఫీసర్‌గా పదోన్నతి పొందిన పెగడపల్లి వాసికి సన్మానం



సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పెగడపల్లికి చెందిన పత్తి స్వరూప–సుధాకర్ రెడ్డి దంపతుల పెద్ద కుమారుడు జీవన్‌రెడ్డి ఆర్మీ ఆఫీసర్ (కెప్టెన్‌గా) ఇటీవల పదోన్నతి పొందాడు. మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ శుక్రవారం జీవన్‌రెడ్డిని సన్మానించారు. మాజీ సర్పంచులు ఆరెల్లి సుజాత రమేశ్, నాయకులు నక్కల కొమురయ్య, జంగ రమణారెడ్డి, పింగిలి మల్లారెడ్డి, రాజేశం, నారాయణ, రాజ్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

రామగుండం: పట్టణంలోని ప్రధాన డ్రైనేజీ మురుగు, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతోంది. దశాబ్దాల క్రితం నిర్మించిన డ్రైనేజీ పునరుద్ధరణకు నోచుకోకపోవడంతో మురుగు నీరు ఎక్కడికక్కడ నిలిచి అందులోని ప్లాస్టిక్ వ్యర్థాలు నీటిపై తేలియాడుతున్నాయి. దీనిపై పాలకులు ప్రత్యేక దృష్టిసారించి నూతనంగా ప్రతిపాదించిన భూగర్భ డ్రైనేజీ నిర్మాణాన్ని సత్వరమే ప్రారంభించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
భాస్కరరావు, ఎంపీడీవో, గ్రామ ప్రత్యేక అధికారి, సెల్ నం.: 9281486900

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500